https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 PM TO 10 PM

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 / సంచిక:29 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / సోమవారం, సెప్టెంబర్ 14,2026

# గోవాలో యూసీసీ అమలు చేయాలి

## అమిత్ షాకు అసదుద్దీన్ సవాల్

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత ఓవైసీ సవాల్
- విభిన్న సంస్కృతుల దేశంలో ఒకే చట్టం అసాధ్యమన్న ఓవైసీ
- రాజకీయ లబ్ధి కోసమే యూసీసీ అంటున్నారని ఆరోపణ



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. 2029 నాటికి ఎన్డీయే పాలిత ప్రాంతాల్లో ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) అమలు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఓవైసీ తీవ్రంగా స్పందించారు. "మీకు ధైర్యం ఉంటే, ముందుగా గోవాలో యూసీసీని అమలు చేయండి" అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశం వంటి విభిన్న సంస్కృతులు, విలక్షణ సంప్రదాయాలు కలిగిన దేశంలో అందరికీ ఒకే రకమైన చట్టాన్ని రుద్దడం సాధ్యం కాదని ఓవైసీ అభిప్రాయపడ్డారు. యూసీసీని తీసుకురావడం వల్ల రాజ్యాంగం గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు కల్పించిన హక్కులకు, రక్షణకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తోందని ఓవైసీ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గోవాలో ఇప్పటికే కాథలిక్కులు, ఇతర వర్గాలకు వ్యక్తిగత చట్టాల్లో మినహాయింపులు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, ఆ మినహాయింపులను తొలగించకుండా దేశవ్యాప్తంగా యూసీసీని ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.




- అసెంబ్లీ వద్ద గొడవ కేసులో కేటీఆర్ సహాయకుల విచారణ
- సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పీఏ, పీఆర్ఓల హాజరు
- సెప్టెంబర్ 7 నాటి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురిపై ఇప్పటికే కేసులు
- పోలీసులపై బీఆర్ఎస్, బీఆర్ఎస్‌పై పోలీసులు పరస్పర ఆరోపణలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సమయంలో చోటుచేసుకున్న వివాదానికి సంబంధించి నమోదైన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ), ప్రజా సంబంధాల అధికారి (పీఆర్ఓ) సోమవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. సైఫాబాద్ పోలీసులు జారీ చేసిన నోటీసుల మేరకు కేటీఆర్ పీఆర్ఓ మాణిక్య మహేశ్, పీఏ కుంబాల మహేందర్ రెడ్డి దర్యాప్తు అధికారి ఎదుట హాజరై తమ వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ప్రాంగణం వద్ద విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకున్నారన్న ఆరోపణలపై వీరిద్దరిపై సెప్టెంబర్ 9న కేసు నమోదైంది. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి. జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద సైఫాబాద్ పోలీసులు వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ క్రమంలోనే కేటీఆర్ సహాయకులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం, దర్యాప్తును కొనసాగించేందుకు మాత్రం అనుమతినిచ్చింది. ఈ నెల 7న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉన్న నల్ల టీ-షర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లారు. అయితే, రాజకీయ నినాదాలు ఉన్న దుస్తులతో లోపలికి అనుమతించేది లేదని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి కేటీఆర్, హరీశ్‌రావు సహా 12 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, వారిని దూషించారన్నది ప్రధాన ఆరోపణ. అదేవిధంగా, అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ప్రత్యేకంగా కేసు నమోదైంది. మరోవైపు, పోలీసులు తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు.

## బేగంబజార్‌లో

# అమెరికన్ డైమండ్స్ తో గణపతి..



- హైదరాబాద్ బేగంబజార్‌లో కొలువైన 48 కిలోల బంగారు గణేశుడు
- విగ్రహంపై 3.83 లక్షల అమెరికన్ డైమండ్స్, 24 క్యారెట్ల బంగారు పూత
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఫీల్‌ఖానాలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం
- లాల్‌బాగ్‌చా రాజా, తిరుపతి బాలాజీ రూపాల స్ఫూర్తితో తయారీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక గణేశుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఫీల్‌ఖానా ప్రాంతంలో కొలువుదీరిన ఈ 48 కిలోల 'బంగారు గణేశుడు' ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. ఈ అద్భుత రూపాన్ని కళ్లారా వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ స్వర్ణ గణనాథుడిని అపురూపంగా తీర్చిదిద్దారు. సుమారు 3.83 లక్షలకు పైగా అమెరికన్ డైమండ్స్‌తో ఈ విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీనికి తోడు 24 క్యారెట్ల బంగారు పూత పూయడంతో స్వామివారు దివ్యకాంతులతో శోభాయమానంగా వెలిగిపోతున్నారు. వినాయకుని ఈ అద్భుత రూపాన్ని చూసి భక్తులు పరవశించి పోతున్నారు.ముంబైలోని ప్రసిద్ధ లాల్‌బాగ్‌చా రాజా, తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి రూపాల స్ఫూర్తితో ఈ విగ్రహాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ రెండు దివ్య రూపాల మేళవింపుతో కొలువుదీరిన ఈ స్వర్ణ గణపతి భక్తులకు అరుదైన రీతిలో దర్శనమిస్తున్నాడు. దీంతో ఈ విగ్రహం నగరంలోనే అత్యంత ప్రత్యేకమైనదిగా ప్రాచుర్యం పొందుతోంది.

# మరో 18 నియోజకవర్గాలకు

## ఇన్‌చార్జులను ప్రకటించిన కవిత

- వినాయక చవిత సందర్భంగా పలు నియామకాలను చేపట్టిన కవిత
- ఇప్పటి వరకు 60 స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తి
- మెదక్ లోక్‌సభ స్థానానికి కూడా అధ్యక్షుడిని ప్రకటించిన కవిత



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

రాష్ట్ర రాజకీయాల్లో సొంత పార్టీ తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసుకునే దిశగా ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత శరవేగంగా అడుగులు వేస్తున్నారు. సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆమె, తాజాగా వినాయక చతుర్థి శుభసందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ పరంగా పలు కీలక నియామకాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 18 కీలక అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ఖరారు చేయడంతో పాటు, పలు జిల్లాలకు నూతన అధ్యక్షులను, అనుబంధ విభాగాల వారీగా బాధ్యులను నియమిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ తాజా జాబితాతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలోని మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, నాంపల్లి, అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నంతో పాటు ఉత్తర, దక్షిణ తెలంగాణలోని ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఖానాపూర్, నిర్మల్, హుజూరాబాద్, దేవరకొండ, ఇల్లందు, అశ్వారావుపేట నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించారు. దీనికి తోడు మెదక్ లోక్‌సభ స్థానానికి కూడా పార్టీ అధ్యక్షుడిని ప్రకటించడం ద్వారా తెలంగాణ రక్షణ సేన రాబోయే ఎన్నికల వ్యూహానికి సమరశంఖం పూరించినట్లయింది.

# దాడి ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : కేటీఆర్

హైదరాబాద్ : ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14



పీఆర్వో మహేష్ , పీఏ మహేందర్‌రెడ్డి పై పోలీస్‌స్టేషన్‌లో గుండాలు చొరబడి దాడి చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రారంభం రోజున జరిగిన ఘటనలో విచారణ పేరిట తన సిబ్బందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లో 15 మంది గుండాలు అక్రమంగా చొరబడి వారిపై మూకుమ్మడిగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారురేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో రౌడీల రాజ్యం, గుండాల రాజ్యం నడుస్తోంది. ఇది కాంగ్రెస్ గుండాల పనా ? లేక మఫ్టీలో పోలీసులకే ముసుగులు వేసి కుట్రపన్ని దాడి చేయించరా ? అనే అనుమానాలు వస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రేవంత్ ప్రభుత్వానికి గణనాథుడు సద్బుద్ధిని ప్రసాదించాలి: రాంచందర్



- గణేశ్ మండప నిర్వాహకులకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సహకరించాలన్న రాంచందర్ రావు
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వినాయకుడిని కోరుకున్నానని వెల్లడి
- ప్రజల్లో ఏటేటా భక్తిప్రపత్తులు ఇనుమడిస్తున్నాయన్న రాంచందర్ రావు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించుకోవడానికి గణేశ్ మండప నిర్వాహకులకు విధిగా పూర్తిస్థాయి సహకారం అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేలా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా రేవంత్ రెడ్డి సర్కార్‌కి ఆ విఘ్నేశ్వరుడు 'సద్బుద్ధి'ని ప్రసాదించాలని తాను వేడుకున్నట్లు వ్యాఖ్యానించారు.రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం పాడిపంటలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ప్రతీ కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించేలా గణనాథుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. ఏటా గణేశ్ ఉత్సవాల పట్ల ప్రజల్లో భక్తిప్రపత్తులు ఇనుమడిస్తున్నాయని, ఊరూరా ప్రజలు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో భాగస్వాములు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు, మండపాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు భద్రతా, రవాణా ఏర్పాట్లను పటిష్ఠం చేయాలని సూచించారు.

# తెలంగాణ కాంగ్రెస్ తదుపరి ఇన్‌చార్జ్ రేసులో

# అశోక్ గెహ్లాట్!



**ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ విదేశీ పర్యటన**

**ఉన్నత విద్య కోసం 10 నెలలు సెలవుపై వెళ్లనున్న మీనాక్షి**

**రేసులో గెహ్లాట్‌తో పాటు ముకుల్ వాస్నిక్, శక్తిసిన్హ్ గోహిల్ పేర్ల పరిశీలన**

**త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్న కాంగ్రెస్ అధిష్ఠానం**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య నిమిత్తం సుదీర్ఘ సెలవుపై వెళ్లనుండటంతో, ఆమె స్థానంలో గెహ్లాట్ పేరును పార్టీ అధిష్ఠానం ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లనున్నారు. ఇందుకోసం ఆమె సుమారు 10 నెలల పాటు సెలవు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆమె గైర్హాజరీతో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పదవి ఖాళీ కానున్న నేపథ్యంలో, అశోక్ గెహ్లాట్‌తో పాటు సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, శక్తిసిన్హ్ గోహిల్ పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే, అపార రాజకీయ అనుభవం ఉన్న గెహ్లాట్ వైపే పార్టీ అగ్రనాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.దీపా దాస్‌మున్షీ స్థానంలో 2025 ఫిబ్రవరి 14న మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమె ఏఐసీసీ పరిశీలకురాలిగా కూడా వ్యవహరించారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన ఆమె, 2009లో మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 30,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాగా, తెలంగాణ కొత్త ఇన్‌చార్జ్ నియామకంపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది.



# ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్ : ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఖైరతాబాద్ లోని పంచముఖ సంకటహర మహాగణపతి ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దానం నాగేందర్ ఆధ్వర్యంలో తలసానిని సన్మానించి గణపతి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలో నే అతిపెద్ద వినాయకుడిగా ఖైరతాబాద్ గణపతి కి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 69 సంవత్సరాల నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. 11 రోజుల పాటు పూజలు అందుకునే అతిపెద్ద ఖైరతాబాద్ వినాయకుడిని ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చి దర్శనం చేసుకుంటారని చెప్పారు.ప్రజలందరిపై ఆ గణనాధుడి చల్లని దీవెనలు, ఆశీస్సులు ఉండాలి ఆకాంక్షించారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ కి శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ మండపం వద్ద భారీకెడ్లు , సీసీ కెమెరాలు, నిమజ్జనం క్రేన్ తదితర ఏర్పాట్లను గతంలో ఉత్సవ కమిటీ వారు చేసుకునే వారని చెప్పారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మంత్రిగా తాను చొరవ తీసుకుని అన్ని రకాల ఏర్పాట్లను ప్రభుత్వం ఆధ్వర్యంలో చేయడం జరిగిందని వివరించారు. ఆయన వెంట ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు బాక్సర్ అశోక్, గజ్జెల నగేష్, మహేష్ యాదవ్, రాంరెడ్డి, ఆనంద్, మహేందర్ తదితరులు ఉన్నారు.



# వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు



యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు14(ట్రైనెట్ న్యూస్):

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కార్యాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా గణనాథుడిని ప్రార్థించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ద్వారా సహజసిద్ధమైన పద్ధతిలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు.ఈ పూజా కార్యక్రమంలో బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.





# డీఎస్సీ అభ్యర్థుల కష్టానికి న్యాయం చేయాలి వైఎస్ జగన్

అమరావతి : ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14



ఏపీలో 2025 డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబు కు మరోసారి ట్విటర్ వేదిక ద్వారా ప్రశ్నల వర్షం కురిపించారు. డీఎస్సీ పరీక్షల విశ్వసనీయత కోల్పోతే యువత కలలకు రెక్కలు కత్తిరించినట్లేనని పేర్కొన్నారు. అభ్యర్థుల కష్టానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి జవాబు తారితనం ఉండాల్సిన అవసరం లేదా అంటూ నిలదీశారు. లక్షలాది మంది అభ్యర్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడుతూ తమ కుటుంబాలు కష్టపడి సంపాదించిన డబ్బుతో పరీక్షలకు హాజరవుతున్న సమయంలో వ్యవస్థ వారి ఆశలను నీరుగార్చవద్దని సూచించారు. న్యాయం అనేది ఒక ఐచ్ఛికం కాదు. అది ఒక బాధ్యతగా గుర్తించాలని కోరారు. డీఎస్సీలో జరుగుతున్న ప్రస్తుత కుంభకోణానికి చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు.

# బీజేపీలో చేరబోతున్న 17 మంది టీఎంసీ రెబల్ ఎంపీలు..

# దుర్గా పూజలలోపేనన్న ఎన్సీపీఐ ఎంపీ



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

17 మంది టీఎంసీ రెబల్ ఎంపీలు బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని టీఎంసీ రెబల్ ఎంపీ, ప్రస్తుత ఎన్సీపీఐ పార్టీ ఎంపీ జగదీష్ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. మమతా బెనర్జీ స్థాపించిన టీఎంసీ నుంచి గెలిచి, ఎన్సీపీఐలో చేరిన ఎంపీల్లో జగదీష్ చంద్ర ఒకరు. సోమవారం జగదీష్ చంద్ర మీడియాతో మాట్లాడారు. వచ్చే దుర్గా పూజ లోపు 17 మంది టీఎంసీ రెబల్ ఎంపీలు, ప్రస్తుత ఎన్సీపీఐ ఎంపీలు బీజేపీలో చేరుతారని ఆయన వెల్లడించారు.అయితే, ముగ్గురు మైనారిటీలు మాత్రం బీజేపీలో చేరడం లేదని తెలిపారు. ఎన్సీపీఐ ఎంపీలు అబూ తాహెర్, ఖలిలుర్ రహమాన్‌లు వేరే విభాగంగా ఉంటారని, అయితే, బీజేపీ, ఎన్డీయేకు మద్దతుగా ఉంటారని జగదీష్ చంద్ర అన్నారు. మైనారిటీ ఎంపీలు ఉన్న నియోజకవర్గాల్లో మైనారిటీల జనాభా ఎక్కువగా ఉందని, అందువల్ల వారు నేరుగా బీజేపీలో చేరకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల వారికి రాజకీయంగా ఇబ్బందులొచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్సీపీలో చేరే విషయంలో బీజేపీ మద్దతు తమకు ఉందని, అయితే ఎంపీలు బీజేపీలో చేరాలనుకుంటున్నారని చెప్పారు.అన్నీ అనుకున్నట్లు జరిగితే 20 మంది టీఎంసీ రెబల్ ఎంపీల్లో 17 మంది బీజేపీలో చేరడం ఖాయం అని జగదీష్ అన్నారు. అతడు పార్టీకి తిరుగుబాటు చేసిన నేపథ్యంలో భారీ భద్రత మధ్య ఆదివారం సొంత నియోజకవర్గమైన కూచ్ బెహర్ చేరుకున్నారు. ఇదే సమయంలో కొందరు బీజేపీ కార్యకర్తలు అక్కడి టీఎంసీ కార్యాలయంపై దాడి చేసి, ధ్వంసం చేశారు. కొంతమంది బీజేపీ నేతలు ఆయన ఇంటిముందు నిరసన తెలిపారు. జగదీష్ పర్యటన నేపథ్యంలో అక్కడ స్వల్ప ఉద్రిక్తత, రాజకీయ ఘర్షణ తలెత్తింది.

# వినాయక చవితి రోజున విచారణ పేరుతో వేధింపులకు పాల్పడడం దారుణం

## : మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్ :ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14

రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ లో శాంతి భద్రతలు రోజురోజుకు దిగజారుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిఆరోపించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ మహేందర్ రెడ్డి , పీఆర్వో మహేష్ ను వినాయక చవితి రోజున విచారణ పేరుతో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం దారుణమని అన్నారు.వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.పోలీసుల సమక్షంలోనే మాస్కులు ధరించిన 15 మంది కాంగ్రెస్ కార్యకర్తలు మహేందర్ రెడ్డి, మహేష్‌పై దాడి చేయడానికి యత్నించడం మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి పారిపోయిన ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.పోలీస్ స్టేషన్‌లోనే దాడికి యత్నించే స్థాయికి కాంగ్రెస్ గుండాల అరాచకం పెరగడం తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు. దాడికి యత్నించిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136